# స్వేచ్ఛగా ఓటేయాలి

**పోలింగ్‌కు పకడ్బందీ ఏర్పాట్లు**
**కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు, సీపీ కల్మేశ్వర్ సింగేనవార్**

కంఠేశ్వర్, మే 11: పార్లమెంట్ ఎన్నికల్లో ప్రతి ఓటరు స్వేచ్ఛగా తమ ఓటుహక్కును వినియోగించుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు అన్నారు. కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీపీ కల్మేశ్వర్ సింగేనవార్‌తో కలిసి పోలింగ్, కౌంటింగ్ కోసం చేపట్టిన ఏర్పాట్లను వివరించారు. ప్రజలు స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓ టు వేసేలా పకడ్బందీ చర్యలు తీసుకున్నామన్నారు. ఓటరు కార్డు లేకపోయినా ఎన్నికల సంఘం నిర్దేశించిన 12 గుర్తింపు కార్డుల్లో ఏదైనా ఒకదాన్ని వెంటతెచ్చుకొని ఓటు హక్కు వినియోగించుకోవాలని తెలిపారు. సీపీ కల్మేశ్వర్ మాట్లాడుతూ ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనలకు సంబంధించి 9 కేసు లు నమోదు చేశామన్నారు. ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు జిల్లా పరిధిలో 3వేల పైచీలుకు మందితో భద్రతా ఏర్పాట్లు చేశామని, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలవద్ద సాయుధ బలగాలను మోహరిస్తున్నామని తెలిపారు. అనంతరం ఎన్నికల సాధారణ పరిశీలకులు ఎలిజ్ వజ్ ఆర్ సమక్షంలో పోలింగ్ సిబ్బంది థర్డ్ ర్యాండమైజేషన్ ప్రక్రియను పూర్తిచేశారు.



మాట్లాడుతున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు, పక్కన సీపీ కల్మేశ్వర్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్, పక్కన మాజీ ఎమ్మెల్యేలు జీవన్‌రెడ్డి, బిగాల, మాజీ ఎమ్మెల్సీ వీజీగౌడ్, జడ్పీ చైర్మన్ విఠల్‌రావు, మేయర్ నీతూకిరణ్

# జనంలో మార్పు మొదలైంది

- కేసీఆర్ రావాలని కోరుకుంటున్నారు
- రాష్ట్రంలో అత్యధిక స్థానాలు బీఆర్‌ఎస్‌వే
- నిజామాబాద్ లోక్‌సభ అభ్యర్థి బాజిరెడ్డి



ఖలీల్‌వాడి/ బోధన్, మే 11: కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీలను నమ్మి ప్రజలు కేసీఆర్‌ను దూరం చేసుకున్నారని, కానీ అనతి కాలంలోనే ప్రజల్లో మార్పు మొదలైందని, కేసీఆర్ నాయకత్వాన్ని కోరుకుంటున్నారని నిజామాబాద్ బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ అన్నారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ అత్యధిక స్థానాలు గెలుచుకుంటుందని, రాష్ట్రంలో తొలి విజయం తనదేనని తెలిపారు. మాజీ ఎమ్మెల్యేలు జీవన్‌రెడ్డి, బిగాల గణేశ్‌గుప్తా, మాజీ ఎమ్మెల్సీ వీజీగౌడ్‌తో కలిసి బాజిరెడ్డి శనివారం నిజామాబాద్‌లోని జిల్లా పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. అంతకుముందు సాలూర మండలం కుమ్మన్‌పల్లిలో ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ ఏ ఒక్క హామీని అమలు చేయలేదన్నారు. పసుపుబోర్డు తేలేని బీజేపీ ఎంపీ అర్వింద్.. ఇప్పుడు షుగర్ ఫ్యాక్టరీ పునరుద్ధరణ గురించి మాట్లాడుతున్నాడని ఎద్దేవా చేశారు. ఐదేళ్ల క్రితం జరిగిన ఎన్నికల్లో ప్రస్తుత కాంగ్రెస్ అభ్యర్థి జీవన్‌రెడ్డి, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి కలిసి అర్వింద్‌ను గెలిపించారన్నారు. శ్రీనన్న (డీఎస్) కొడుకు అర్వింద్‌ను రాజకీయాలకతీతకంగా అందరం సపోర్టు చేసి గెలిపించామని జీవన్‌రెడ్డి గతంలో మాట్లాడిన వీడియోను ఈ సందర్భంగా ప్రదర్శించారు. జీవన్‌రెడ్డి డూప్లికేట్ సెక్యులర్ నాయకుడని, నిజమైన సెక్యులర్ లీడర్ కేసీఆర్ మాత్రమేనని తెలిపారు. వా స్త వా ని కి మాజీ మంత్రి మండవ వెంకటేశ్వరరావును ఎంపీ అభ్యర్థిగా నిలబెట్టాలని కాంగ్రెస్ యోచిస్తుంటే, అర్వింద్ ఢిల్లీ వెళ్లి జీవన్‌రెడ్డికి టికెట్ వచ్చేలా చేశాడన్నారు. అర్వింద్‌ను సొంత పార్టీ నేతలే తిరస్కరిస్తున్నారని, రావణాసురుడి లాంటి అతడి వలలో పడొద్దని యువతను కోరారు. కాంగ్రెస్, బీజేపీ జనాల్ని మోసం చేస్తున్నాయన్నారు. దేశంలో అబద్ధాల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఒక్కరేనని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో ఈ రెండు పార్టీలను చిత్తుగా ఓడించడం ఖాయమన్నారు. కేసీఆర్ హయాంలో మైనార్టీల కోసం రెసిడెన్షియల్ కళాశాల, డిగ్రీ కళాశాలలను ఏర్పాటు చేశామన్నారు. షాదీముబారక్, కల్యాణలక్ష్మి చెక్కులు ఎందుకు బౌన్స్ అవుతున్నాయని ప్రశ్నించారు. తాను గెలిస్తే నిజామాబాద్– ఆదిలాబాద్ రైల్వేలైన్ పూర్తి చేయిస్తానని తెలిపారు. బోధన్ నుంచి బీదర్, కరీంనగర్ నుంచి ముంబై వరకు ఎక్స్‌ప్రెస్ రైలుని తీసుకువస్తానని పేర్కొన్నారు. తాను బాన్సువాడ ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు రూ.630 కోట్లతో నిజాంసాగర్ కాల్వల ఆధునీకరణ పనులు చేయించానని, ఈ ప్రాంతానికి ఈ పనులు ఎంతో ఉపయోగపడ్డాయని అన్నారు. మంజీరా నదిపై రెండు భారీ వంతెనలు తన హయాంలో నిర్మించామని, దీంతో బిచ్కుంద, మద్నూర్ ప్రాంతాలకు దూరభారం తగ్గిందన్నారు. తనను గెలిపిస్తే కేంద్రం ఇచ్చిన విభజన హామీల అమలుకు కొట్లాడుతానని అన్నారు. గల్ఫ్ పాలసీని కొట్లాడి తీసుకువస్తానని, పసుపు బోర్డును తీసుకువస్తానని తెలిపారు.

## కాంగ్రెస్ ఒక్క హామీని అమలు చేయలేదు

**జీవన్‌రెడ్డి, ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే**

పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ ముందంజలో ఉన్నదని ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి అన్నారు. కారు గుర్తుకు ఓటేసి బాజిరెడ్డిని గెలిపించాలని కోరారు. పసుపు బోర్డు ఇవ్వలేక అర్వింద్ షుగర్ ఫ్యాక్టరీపై పడ్డాడని అన్నారు. అర్వింద్ గురించి మాట్లాడుకోవడం దండుగ అని, సొంత పార్టీ నాయకులే అర్వింద్ ఓడిపోవాలని కోరుకుంటున్నారని తెలిపారు. 420 కాంగ్రెస్‌కు నూకలు చెల్లిపోయాయన్నారు. సమావేశంలో జడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు, మాజీ ఎమ్మెల్సీ వీజీ గౌడ్, నగర మేయర్ దండు నీతూ కిరణ్, బాజిరెడ్డి జగన్ , ప్రభాకర్ రెడ్డి, సుజిత్ సింగ్ ఠాకూర్, రవిచందర్, సిర్పరాజు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ నేతల స్ట్రీట్ ఫైట్

**నడిరోడ్డుపైనే కొట్టుకున్న నాయకులు**



ఇందల్వాయి, మే 7: కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేతలు రోడ్డుపైనే కొట్టుకున్నారు. ఒకరిపై మరొకరు ముష్టిఘాతాలకు దిగారు. నిజామాబాద్ జిల్లా ఇందల్వాయి మండలంలో శనివారం ఈ ఘటన చోటు చేసుకున్నది. జక్రాన్‌పల్లి మండలానికి చెందిన మునిపల్లి సాయరెడ్డి ఇటీవలే కాంగ్రెస్‌లో చేరారు. ఎన్నికల నేపథ్యంలో ఆయన పక్క మండలమైన ఇందల్వాయిలో ప్రచారం చేస్తున్నారు. అయితే, దీన్ని జీర్ణించుకోలేని ఇందల్వాయి మండలానికి చెందిన సీనియర్ నాయకుడు సంతోష్‌రెడ్డి గుర్రుగా ఉన్నారు. ఈ క్రమంలో శనివారం మండలంలోని తిర్మన్‌పల్లి గ్రామంలో ప్రచారం చేసేందుకు సాయరెడ్డి వచ్చారు. దీంతో అతడి కారుకు సంతోష్‌రెడ్డి కారు అడ్డం పెట్టి వాగ్వాదానికి దిగారు. నా మండలంలో నీ పెత్తనమేంటి? అంటూ కారులో ఉన్న సాయరెడ్డి గల్లా పట్టుకొని పిడిగుద్దులు కురిపించాడు. దీంతో ఆగ్రహానికి లోనైన సాయరెడ్డి కారు దిగి సంతోష్‌రెడ్డిపై దాడికి దిగారు. మూడు, నాలుగు నిమిషాల సేపు ఇద్దరూ గల్లాలు పట్టుకుని కొట్టుకున్నారు. నడిరోడ్డుపై కాంగ్రెస్ నేతల ఫైటింగ్ చూసి జనం ముక్కున వేలేసుకున్నారు. ఎన్నికలకు ముందు ఇలా కొట్టుకోవడం చర్చనీయాంశమైంది.




వేల్పూర్ మండలంలో అమీనాపూర్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి





కుమ్మన్‌పల్లిలో మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి , పక్కన మాజీ ఎమ్మెల్సీ వీజీగౌడ్, బీఆర్‌ఎస్ నాయకురాలు ఆయేషా ఫాతిమా




నందిపేట మండలం వెల్మల్‌లో ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి



నిజామాబాద్ నగరంలోని పాములబస్తీలో ప్రచారం నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే బిగాల గణేశ్ గుప్తా, మేయర్ నీతూకిరణ్

దేశాయ్‌పేట్‌లో ప్రజలనుద్దేశించి మాట్లాడుతున్న మాజీ స్పీకర్, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి



# వచ్చేది సంకీర్ణ ప్రభుత్వమే..

- మాజీ స్పీకర్, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస రెడ్డి

బాన్సువాడ, మే 11: దేశంలో వచ్చేది సంకీర్ణ ప్రభుత్వమేనని మాజీ స్పీకర్, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస రెడ్డి అన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి, డీసీసీబీ మాజీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డితో కలిసి బాన్సువాడలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. దేశంలోని ఆయా రాష్ట్రాల ప్రాంతీయ పార్టీలు ఏకమై సంకీర్ణ ప్రభుత్వానికి నాంది పలుకుతాయని, బీజేపీకి 200 సీట్లు కూడా దాటవని చెప్పారు. బీజేపీ పేద ప్రజలకు చేసిందేమీ లేదని, అదానీ, అంబానీలకు రూ.15లక్షల కోట్లను మాఫీ చేసిందని అన్నారు. బీజేపీ మత విద్వేషాలను ఉసిగొల్పుతూ, యువతను రెచ్చగొట్టే కార్యక్రమాలు చేపడుతున్నదని అన్నారు. బీజేపీకి ఒక ఆయోధ్య రామ మందిరం తప్ప, ఎజెండా లేదన్నారు. తెలంగాణలో నలుగురు బీజేపీ ఎంపీలుండి రాష్ట్రానికి చేసిన అభివృద్ధి ఏంటో చెప్పాలని సవాల్ విసిరారు. రాష్ట్రం నుంచి పన్ను రూపేనా కేంద్రానికి రూ. 3లక్షల కోట్లు చెల్లిస్తే, రాష్ట్రానికి ఇచ్చింది రూ.లక్షా60 కోట్లు మాత్రమే అని తెలిపారు. మోదీ సబ్ కా వినాష్ చేస్తున్నారని సొంత పార్టీ ఎంపీ అభ్యర్థి ఉమాభారతి అన్నారని, దాన్ని బట్టి చూస్తే బీజేపీ రోజు రోజుకూ ప్రజల్లో విశ్వాసం కోల్పోతున్నదని చెప్పారు. రిజర్వేషన్లను రద్దు చేస్తామని, రాజ్యాంగాన్ని తిరగరాస్తామని చెప్పడం ఎంత వరకు సబబు అని, రాజ్యాంగం రాసిన అంబేద్కర్‌ను అవమానపర్చడమే అని, పేద ప్రజల హక్కు రాజ్యాంగమని వివరించారు.

## కాంగ్రెస్ అబద్ధాల పార్టీ..

గత అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ పార్టీకి ఓటు వేశారని, ఐదు నెలలోనే కాంగ్రెస్ పార్టీ అబద్ధాల పార్టీ అని ప్రజలు గ్రహించారని పోచారం అన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ 10 నుంచి 12 స్థానాల్లో గెలువబోతున్నదని ధీమా వ్యక్తంచేశారు. ఎన్నికల తర్వాత రాష్ట్రంలో రాజకీయ సమీకరణాలు మారబోతున్నాయని చెప్పారు. 13న నిర్వహించే పోలింగ్‌లో కారు గుర్తుకు ఓటు వేసి బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి గాలి అనిల్ కుమార్‌ను గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తిచేశారు. బాన్సువాడ నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ పార్టీకి 50 వేల మెజార్టీ వస్తుందని, ఎంపీ స్థానాన్ని లక్షా50 వేల మెజార్టీతో గెలుస్తున్నామని చెప్పారు. ముస్లిములు మంచి ఆలోచన చేయాలని, కాంగ్రెస్‌కు ఓటేస్తే బీజేపీ గెలుస్తుందన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీకి, కాంగ్రెస్ పార్టీకి మధ్య ఓట్ల వ్యత్యాసం కేవలం 1.8శాతమేనని, ప్రస్తుత సర్వేల ప్రకారం కాంగ్రెస్ పార్టీ కన్నా బీఆర్‌ఎస్ 8శాతం ఓట్లతో ముందంజలో ఉన్నదని, ఫలితాలు తారుమారవుతాయని చెప్పారు. ఎంపీ ఎన్నికల నేపథ్యంలో కష్టపడి పనిచేసిన బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలకు పోచారం ధన్యవాదాలు తెలిపారు. రైతుబంధు సమితి జిల్లా కన్వీనర్ డాక్టర్ అంజిరెడ్డి, సొసైటీ అధ్యక్షుడు ఏర్వాల కృష్ణారెడ్డి, మండల అధ్యక్షుడు మోహన్‌నాయక్, మహ్మద్ ఎజాస్, అమేర్ చాహూస్ పాల్గొన్నారు.

